


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ మంగళవారం 09-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 177 పేజీలు : 4 వెల : రూ 2-00

## గండిమైసమ్మ చౌరస్తాలో వ్యక్తి ఆత్మహత్య

మేడ్చెల్,జూలై8: మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తాలో ఖాళీ ప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి చెట్టుకు ఉరేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన..!



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేయనున్నట్లు తెలుస్తోంది. తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ నుంచి జిల్లాల పర్యటన చేపట్టాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 9వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి, ఉమ్మడి జిల్లా సమస్యలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. 9వ తేదీనే జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా గ్రూపు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి క్యాంటీన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అదే రోజు జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్ రెడ్డి ప్రసంగం చేయనున్నారు. అదే సమావేశంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. సాయంత్రం 5.30 గంటల తరువాత తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు రేవంత్ రెడ్డి. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సీఎం పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్యలపై నివేదికలు రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. రేవంత్ సీఎం అయ్యాక తొలిసారి జిల్లాల పర్యటన చేస్తున్న నేపథ్యంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అనేదానిపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు మళ్ళీ వడ్డీతో సహా చెల్లిస్తాం..

### రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ : పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లో ఉన్న భారీ నిర్మాణాలను సోమవారం ఉదయం అధికారులు కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీ కాంగ్రెస్ నాయకులు అమ్మిన, మీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇండ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి ఆశించి ఈరోజు కూలగొట్టించాడో ఒకసారి విచారణ చేయించండి. ప్రజా పాలనలో ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి. లేదంటే ప్రజలు తిరగబడుతారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవు. అని కేటీఆర్ తేల్చిచెప్పారు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్ గౌడ్, మరో కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబం. ఈ ప్లాట్లను 2008లో నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్‌వోసీ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని చాలా మంది ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. కానీ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను వేధించి అమాయక ప్రజలు లక్షలు పోసి నిర్మించుకున్న ఇండ్లను ఈ రోజు కూలగొట్టించాడు అని కేటీఆర్ మండిపడ్డారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణ పురం కాలనీ ప్లాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి ప్లాట్ ఓనర్స్‌కు మేలు చేయడం జరిగింది. కానీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్ధ ప్రభుత్వం అమాయక ప్లాట్ ఓనర్స్ ఇండ్లను కూల్చివేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై కక్షగట్టి చేస్తున్న వేధింపులకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం. భవిష్యత్తులో మా బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్లాట్ ఓనర్లను న్యాయం చేయడం జరుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మా బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని, కార్పొరేటర్లను మీరు వేధిస్తున్నారు.

# యుద్ధప్రాతిపదికన స్కిల్ యూనివర్సిటీ



### అసెంబ్లీ సమావేశాలకు ముందే ఏర్పాటు
### ఐఎస్‌బి తరహాలో బోర్డు ఏర్పాటుకు చర్యలు
### విద్యారంగ, పారిశ్రమిక ప్రముఖులలకు సూచన
### ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ సందర్శించిన సిఎం రేవంత్

హైదరాబాద్,జూలై8: రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరగాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ముందే జులై 23 లోపు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ, విద్యా శాఖ అధికారులతో పాటు పారిశ్రామిక రంగ ప్రముఖులకు సీఎం సూచించారు. వాటిని పరిశీలించి ఇరవై నాలుగు గంటల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులతో ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవెలప్మెంట్ పై సమావేశ మయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు ప్రముఖుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అటు ఐటీ కంపెనీలతో పాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐ.ఎస్.బీ తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చర్చ జరిగింది. అప్పటివరకు ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీలో ఏమేం కోర్సులుండాలి, ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి.. పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, వాటికి అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉండేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులు నిర్వహించాలనేది ముందుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించాలని చెప్పారు. +ర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున ప్రతీ అయిదు రోజులకోసారి సమావేశం కావాలని సీఎం వారికి దిశా నిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా.. ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా... మరేదైనా విధానం అనుసరించాలా.. అనేది కూడా పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ÷ఔనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్‌స్టలెంట్ ను నియమించుకోవాలని సీఎం చెప్పారు. యూనివర్సిటీ వ్యవహారాలకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్టుమెంట్ గా వ్యవహరిస్తుందన్నారు. ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్ మెంట్స్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ హరి ప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ ను ముఖ్యమంత్రి పరిశీలించారు. దాదాపు ఇరవై నిమిషాల పాటు కలియ తిరిగి అందులో ఉండే సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## ముంబయిలో భారీ వర్షాలు..

### 50పైగా విమానాలు రద్దు..!



ముంబయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వానలకు రోడ్లపై వరద పోటెత్తుతున్నది. ఫలితంగా ట్రాఫిక్ జామవుతున్నది. అదే సమయంలో వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు సైతం తీవ్రంగా అంతరాయం కలుగుతున్నది. వానల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తున్నది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటల వరకు పలుచోట్ల 300 మిల్లీమీటర్లకు పైగా వర్షం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ముంబైలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదర్ అతలాకుతలమైంది. ఇక్కడ రోడ్లపై నుంచి రైలు పట్టాల వరకు నీరు నిండిపోయింది. కార్లు రోడ్లపై నీటిలో తేలియాడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (ఃఓఅ) సెలవు ప్రకటించింది. భారీ వర్షాలతో వెలుతురు లేని కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్యాహ్నం 2.22 నుంచి 3.40 గంటల వరకు రన్‌వే కార్యకలాపాలను నిలిపివేసింది. దాంతో 50పైగా విమానాలను రద్దు చేయడంతో పాటు ఆయా విమా నాలను అహ్మదాబాద్, హైదరాబాద్, ఇండోర్‌కు మళ్లించారు. ఇదిలా ఉండగా.. వరద పరిస్థితిని సమీక్షిం చేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే డిజాస్టర్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ముంబయి గార్డియన్ మంత్రి ఎంపీ లోధా, రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ మంత్రి అనిల్ పాటిల్ సైతం హాజరయ్యారు. సమావేశంలో సీఎం షిండే మాట్లాడుతూ నిన్న రాత్రి నుంచి ముంబయిలో 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు.

## రెండు రోజుల రష్యా పర్యటన..

### మాస్కోకు చేరుకున్న ప్రధాని మోదీ..



రెండు రోజుల రష్యా పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరిన ప్రధాని నరేంద్రమోదీ మాస్కోకు చేరుకున్నారు. మాస్కో విమానాశ్రయంలో రష్యా తొలి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీ రెండు రోజులపాటు రష్యాలో పర్యటించనున్నారు. సోమవారం రాత్రి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై భారత్-రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. మంగళవారం భారత్-రష్యా 22వ వార్షిక సదస్సులో పాల్గొననున్నారు. అదేవిధంగా రష్యాలోని భారత సంతతి ప్రజలతో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై మాట్లాడనున్నారు. అనంతరం రెండు రోజుల రష్యా పర్యటనను ముగించుకుని ప్రధాని అక్కడి నుంచి ఆస్ట్రియాకు వెళ్లనున్నారు. ఆస్ట్రియాలో ఒకరోజు పర్యటించి భారత్‌కు తిరిగి రానున్నారు.

## నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే: సుప్రీంకోర్టు




హైదరాబాద్ : అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పలు పిటిషన్లపై సోమవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా నీట్ ప్రశ్నపత్రం లీకైన మాట నిజమేనని స్పష్టం చేసింది. అయితే.. ఎంతమందికి లీకైన పేపర్ చేరిందో స్పష్టత లేదని.. ఇది తేలాల్సి ఉందని చెప్పింది. పేపర్ లీక్‌తో ఇద్దరు విద్యార్థులకే సంబంధం ఉందంటున్నారని.. కానీ, ఈ అంశం 23 లక్షల మందితో ముడిపడిన అంశమని కోర్టు తెలిపింది. అన్ని విధాలుగా పరిశీలించాకే పేపర్ లీకేజ్ పై తుది తీర్పు వెల్లడించనున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కాగా, నీట్ పేపర్ లీక్ పై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నీట్ అవకతవకలపై పార్లమెంట్ లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు పట్టుబట్టిన సంగతి తెలిసిందే. అయితే, దీనిపై ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ క్రమంలో నీట్ రద్దు చేయాలంటూ సుప్రీంలో పలు పిటిషన్లు వేశారు. అయితే.. నీటీ? పరీక్షను రద్దు చేయొద్దంటూ కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ రెండూ వేర్వేరుగా అఫిడవిట్‌లలో సుప్రీం కోర్టుకు తెలిపాయి. కాగా, ఔఇఖ జఉ 2024 పరీక్ష దేశవ్యాప్తంగా మే 5న నిర్వహించారు. ఫలితాలు షెడ్యూల్ కంటే పది రోజుల ముందుగా జూన్ 4న ప్రకటించాయి. ఈ పరీక్షలో 67 మంది టావ్ ర్యాంక్ సాధించినట్లు ఎన్టీఏ తెలిపింది. అంతేకాదు.. కొంతమంది విద్యార్థులకు పరీక్షలో పూర్తి మార్కులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం మంచి నిర్ణయమే అయినప్పటికీ, దానివల్ల మహిళలు ఉద్యోగ అవకాశాలకు దూరం కావొచ్చని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం దేశంలో రెండు రాష్ట్రాలు మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నాయని, మిగతా రాష్ట్రాల్లోనూ దీన్ని పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై సోమవారం చీఫ్‌జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి తరువాత ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "మహిళలకు నెలసరి సెలవులు ఇస్తే వారు మరింత ఎక్కువగా ఉద్యోగాలు చేసేందుకు ప్రోత్సహించినట్లు అవుతుంది. అయితే వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారి తీయవచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చు. అది మేం కోరుకోవడం లేదు. మహిళల ప్రయోజనాల కోసం కొన్నిసార్లు మనం చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారవచ్చు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం విస్తృత చర్చలు జరిపి ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. పిటిషనర్ తన అభ్యర్థనను కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. ఈ ఏడాది ఫిబ్రవరి లోనూ ఇదే అంశంపై పిటిషన్ దాఖలు కాగా, విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. బీహార్ రాష్ట్ర ప్రభుత్వం 1992 నుంచే అక్కడి ప్రభుత్వ ఉద్యోగినులకు రెండు రోజుల నెలసరి సెలవును ఇస్తోంది.

# సంపాదకీయం

మంగళవారం 09-07-2024

## హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు సెక్యులరిజమా..,

హిందూ సాంస్కృతిక విలువలపై, హిందువుల ఆచార సాంప్రదాయాలపై, హిందూ దేవుళ్లు, దేవతలపై పనిగట్టుకుని, అవాకులు చవాకులు పేలడం దేశంలో ఇటీవల కాలంలో ఎక్కువైంది. తాజాగా కాంగ్రెస్ రాకుమారుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంయమనం కోల్పోయి, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా హిందూ దేవుళ్ల ప్రస్తావన చర్చకు తీసుకొచ్చి దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు..స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్రం తర్వాత కాంగ్రెసులోని చాలామంది నాయకులకు హిందువుల ఆచారాలు, సంప్రదాయాల పట్ల, హిందువుల ఆధ్యాత్మికత పట్ల నిర్లక్ష్య భావన ఉంది. దేశంలోని ప్రతి సమస్యకు హిందువుల ఆచార సంప్రదాయాలను కారణంగా చూపడం పరిపాటి అయిపోయింది. అందుకు కారణం లేకపోలేదు.ఈ దేశంలో మెజార్టీ ప్రజలైన హిందువుల ఆచార సంప్రదాయాలు ప్రధాన మైనారిటీ మతాలైన ఇస్లాం, క్రైస్తవ భావజాలానికి భిన్నంగా ఉంటాయి. అందుకే ముస్లింలను, క్రైస్తవులను వెనుకేసుకొచ్చి హిందువుల ఆచారాలను దూషించడం కానీ, ద్వేషించడం కానీ చేస్తే ముస్లింల, క్రైస్తవుల ఓట్లు గుండుగుత్తగా తమ పార్టీకి పడతాయని బీజేపీయేతర అన్ని పార్టీల నాయకులు తలపోయడం అలవాటుగా మారిందనేది అక్షర సత్యం.ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన డీఎంకే నాయకుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని అనుసరించే హిందువులను నీచ నికృష్టంగా తిట్టిపోశారు. ఆయన తాత కరుణానిధి ఏకంగా మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడ్ని నోటికొచ్చినట్లు మాట్లాడి, హిందువులపై తనకు ఉండే ద్వేషాన్ని వెళ్లగక్కారు. ఇక కాంగ్రెస్ పార్టీ చరిత్ర తిరగేస్తే రామాయణం ఒక కట్టు కథని, సుప్రీంకోర్టుకే అఫిడవిట్ దాఖలు చేసి, తన హిందూ వ్యతిరేక పైత్యాన్ని బయట పెట్టుకున్నది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇందుకు భిన్నంగా ఉంటారని ఎందుకు అనుకోవాలి?బీజేపీ , ఆర్ఎస్ఎస్ వాళ్లకు హిందూ సంస్కృతికి సంబంధించిన విషయాలు తెలియవని, వారు నిజమైన హిందువులు కాదని రాహుల్ గాంధీ తరచుగా మాట్లాడుతుంటారు. ఈ దేశాన్ని వ్యతిరేకించే వారి దృష్టిలో ఆర్ఎస్ఎస్, బీజేపీ వాళ్లు మంచివాళ్లు కాదేమో! ఎందుకంటే దేశ భద్రతకు, సమగ్రతకు ప్రమాదం వచ్చినప్పుడు గట్టిగా నిలబడేది వాళ్లే. కశ్మీర్ విలీనీకరణకు కశ్మీర్ రాజు హరి సింగ్‌ను ఒప్పించడం, శ్రీనగర్లో మన యుద్ధ విమానాలు దిగడానికి మంచు గడ్డలు తొలగించడం, శ్రీనగర్ లాల్ చౌక్‌లో పాకిస్తాన్ జెండాను తొలగించి, జాతీయ జెండాను ఎగరవేయడం , పోర్చుగీసు చెర నుండి గోవాను విముక్తి చేయించడంలో సైన్యానికి సహకరించడం, యుద్ధ సమయాల్లో సైన్యానికి పోర్టర్లుగా పనిచేయడం వంటి పనులు చేసే వాళ్లు నిజమైన హిందువులు ఎలా అవుతారు? పైగా కాశ్మీర్ లోయలో హిందువుల నరమేధాన్ని లౌకికవాద ముసుగు చేసుకున్న ఏ హిందూ రాజకీయ నాయకుడు ప్రశ్నించకున్నా బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లు నిలదీశారు కదా! 500 సంవత్సరాలుగా రావణకాష్టంగా మండిన అయోధ్య సమస్యను సులభంగా పరిష్కరించారు కదా! ఇలాంటి పనులు చేసిన వారు నిజమైన హిందువులు అవుతారా? ఈ విషయం భవిష్యత్తు చరిత్ర నిర్ణయించాలి.లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా తొలిసారి ప్రసంగించారు రాహుల్ గాంధీ. ఈ క్రమంలోనే శివుడి ఫొటోని చూపించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు, ఫొటోలు ప్రదర్శించడం నిషేధం అని తేల్చి చెప్పారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీ రాజ్యాంగం గురించీ ప్రస్తావించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తోందని మండి పడ్డారు. ఇది జరగకుండా తాము అండగా నిలబడతామని తేల్చి చెప్పారు. ఈ సమయంలోనే హిందూమతం గురించి మాట్లాడారు రాహుల్. బీజేపీ ఈ మతం పేరు చెప్పి అందరినీ భయపెడుతోందని మండిపడ్డారు. ఏ మతమైనా మనుషులకు ధైర్యం ఇస్తుందని వెల్లడించారు. ఇస్లాం, సిక్కు మతాల గురించి కూడా ప్రస్తావించారు. కొంత మంది తమను తాము హిందువులుగా ప్రచారం చేసుకుంటూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, అలాంటి వాళ్లు అసలు హిందువులే కాదని తీవ్ర విమర్శలు చేశారు. హింసను ప్రేరేపించే వాళ్లను హిందువులు అని ఎలా అనగలమని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ స్పీచ్‌ని అడ్డుకున్నారు. హిందువులంతా హింసావాదులే అన్నట్టుగా మాట్లాడడం చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ హిందూ దేవుళ్లపైన చేసిన ప్రస్తావనను క్షుణ్ణంగా పరిశీలిస్తే దేశంలోని హిందువులు హింసావాదులనీ, విద్వేష కారకులనే అర్థం స్ఫురించక మానదు. ఈ విషయంలో ఆయన మాట మార్చి, బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లను ఉద్దేశించి, ఈ మాటలు అన్నానని ఎంత బుకాయించినా-హిందూ సమాజానికి ఆ మాటల అర్థం చేరిపోయింది. ఇక చివరగా హిందువులను మతపరంగా సంఘటితం చేసే పనిని ఎవరు చేసినా వారికి ఈ దేశంలో దూషణలు తప్పవు. ఈ పరిస్థితి భవిష్యత్తులో తీవ్రంగా ఉంటుంది.

# డాలర్ దెబ్బకు రూపాయి విలవిల

ముంబయి,జూలై8: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు పతనం అవుతోంది. ఇది మరింతగా అగాథంలోకి పడిపోతోంది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా డాలర్ విలువ రూ.83.47కు చేరువయ్యింది. రికార్డు స్థాయికి చేరిన మన విదేశీ మారక నిల్వలు ఇప్పుడు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రూపాయి అదుపునకు ఆర్బీఐ యథేచ్ఛగా డాలర్లను వెదజల్లడం, విదేశీ ఇన్వెస్టర్లు డాలర్లను తరలించుకుపోవడంతో ఇప్పుడు మన వద్ద ఫారెక్స్ నిల్వలు కరిగిపోతున్నాయన్న ఆందోళన కూడా ఉంది. ఇలా ఒకదాని వల్ల మరొకటి పెరిగిపోవడం, తద్వారా రూపాయి మరింత క్షీణించడం, ధరలు ఆకాశాన్నంటడం చకచకా జరిగిపోతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆల్‌టైం రికార్డ్ గా చూడాలి. డాలర్ మారకంలో రూపాయి విలువ రికార్డు కనిష్టస్థాయికి పడిపోయి రూ.83.47 వైపు చూస్తున్నది. కరెన్సీ పతనంతో పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, పప్పులు తదితరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకాయి. రూపాయి పతనాన్ని నిలువరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. 2014కు ముందు బిజెపి అధికారంలోకి రాకముందు.. డాలర్‌తో రూపాయి విలువ 68కి పడిపోతే నరేంద్ర మోడీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఐసియులో పడిపోయిందని.. తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక గొప్పలు చెప్పారు. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి పడిపోతున్న ప్పటికీ.. కట్టడి చర్యలు కానరావడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. దేశీయ గణంకాలు బలహీనంగా చోటు చేసుకో వడానికి తోడు అంతర్జాతీయం గా డాలర్ విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురి చేసిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది జూన్‌లో భారత ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా చోటు చేసుకోవడం.. రికార్డ్ స్థాయిలో వాణిజ్య లోటు పడటంతో రూపాయిపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. డాలర్‌తో రూపాయి విలువ ఇంతటితోనే ఆగుద్దని అనుకోవడానికి లేదని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు.

### రూపాయిని నిలబెట్టే మార్గమేదీ ? ఫలించని దిద్దుబాటు చర్యలు

భారత్‌లోనూ మందగమన భయాలు, అధిక చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడం, ఆర్‌బిఐ వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి. రూపాయి పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో దిగుమతి ఆధారిత అనేక ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. చమురు ధరలు ఎగిసిపడనున్నాయి. అధిక ధరలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర బెంబేలెత్తుతున్నారు. విదేశీ అప్పులు తీవ్ర భారం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపనుంది. ద్రవ్యోల్బణం ఎగిసిపడనుంది. వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఈ చర్యలను కట్టి చేసేందుకు ఆర్థిక ప్రణాళికలు అవసరం. విదేశాల నుంచి దిగుమతలుపై కఠిన ఆంక్షలు విధించాల్సిందే. అలాగే మన పంట విధానాలను సమీక్షించి ఎగుమతులను ప్రోత్సహించాలి. కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటు వాటి లోతెంతో చూపిస్తున్నాయి. విదేశీ రుణం పెరిగి పోయింది. రూపాయి నిలువునా పతనమయ్యింది. వీటికితోడు చమురు, పెట్రో కంపెనీలపై రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని తెచ్చేందుకు పన్నులు వడ్డించారు. బంగారంపై సుంకాలు వేసి ధరలు పెంచేశారు. జీఎస్టీ మినహాయింపులో ఉన్న నిత్యావసరాలపై కూడా పన్ను వేశారు. ఆర్థిక మంత్రి చెప్పినట్టు కేంద్ర ప్రభుత్వానికిది ఇప్పుడు అసాధరణ పరిస్థితే. ఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెట్టాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. వచ్చే కొద్ది నెలల్లో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మాంద్యంలో చిక్కుకొంటే, భారత ఆర్థిక వ్యవస్థ సైతం తీవ్ర సంక్షోభంలోకి జారుకొంటుందని విశ్లేషకులు అంటున్నారు. బ్యాంకింగ్, కరెన్సీ, రుణ సంక్షోభాలు ముంచెత్తుతాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కేంద్ర తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వృద్ధి రేటు కుప్పకూలా తుందని రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ రాజన్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు.

# ఉచిత చేపపిల్లల పంపిణీ ఉంటుందా?

### ప్రభుత్వ విధానం కోసం మత్స్యకారుల ఎదురుచూపు

ఆదిలాబాద్,జూలై8: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఇదంతా ఓ ప్రచార కార్యక్రమంలా సాగింది. ఈ ఏడాది కూడా చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేస్తారా లేదా అన్న అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద 284 చెరువులలో 129.23 లక్షల చేప పిల్లల పంపిణీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 220, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40మి.మీ. సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 మి.మీ. సైజు చేప పిల్లలను వదలనున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులున్నారు. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు కార్మికులకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించింది. అయితే ఈ వ్యవహారంలో అంతా అవినీతి చోటుచేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయయలేదని అంటున్నారు. వర్షాలు సంమృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న కట్ల, రోకు, బొచ్చ, బంగారు తీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో చేపల మార్కెట్‌ను నిర్మించేందుకు స్థలాలను గుర్తించి ఇస్తామని గత సర్కార్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న రిజర్వాయర్, ప్రాజెక్టులలో రొయ్యల పెంపకం పై అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే ఉపాధి పురుగుతుందని అంటున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు, చిక్‌మాన్ ప్రాజెక్టులలో చేప పిల్లల పెంపకంతో పాటుయ్యల పెంపకంపై దృష్టి సారించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఏడాదంతా సరిపడా నీటి నిల్వలు ఉండే అవకాశం ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందనిచెబుతున్నారు. అలాగే మార్కెట్‌లో రొయ్యలకు మంచి డిమాండ్ కూడా ఉండడమే వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రొయ్యల పెంపకంతో మత్స్య కార్మికులకు 3 కాలాల పాటు ఉపాధి దొరకడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ చేపలు పెంచే రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచితే సరైన దిగుబడులు రావని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా రొయ్యల పెంపకానికి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ యేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోయిన అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో చేప పిల్లలను వదలడం సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు రావడం లేదు. భారీ వర్షాలు కురుస్తే కానీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

### స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహకాలు

### పలు స్వయం సమృద్ధి వ్యాపారాలకు తోడ్పాటు

హైదరాబాద్,జూలై8: మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో మహిళా సంఘాలతో తెలంగాణ వంటకాల అమ్మకం దుకాణాలు ప్రారంభించిన ప్రభుత్వం...గ్రామీణ మహిళల ఆదాయ వనరలు పెంచే దశగా చర్యలు చేపట్టింది. వారితో నాటుకోళ్ల పెంపకం, పౌల్ట్రీ ఫారాలు, పాడి ఉత్పత్తులు విక్రయ కేంద్రాలు, సంచార చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయించనుంది. బ్యాంకుల ద్వారా వారికి ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించడం, వడ్డీ రాయితీలతో వారి కాళ్లపై వారు నిలుదొక్కుకునేలా చేయూత అందించిన ప్రభుత్వం...వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మరో కీలక ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళాల ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం, పౌల్ట్రీఫ్రారాలు ఏర్పాటుతోపాటు పాడి ఉత్పత్తులు, చేపల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకులతో చర్చించి మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించనుంది. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లాకు 500 మంది డ్వాక్రా సభ్యులకు పాడి పశువులు అందజేయనున్నారు. దీనికి నాలుగున్నర కోట్లు ఖర్చు కానుంది. ఒక్కొక్క సభ్యురాలికి ఒకటి లేదా రెండు పాడి గేదెలను అందజేయనున్నారు. దీనికోసం లక్ష రూపాయలు రుణం ఇవ్వనున్నారు. పశువులు మేపుకునేందుకు అనువైన ప్రాంతం ఉన్న వారికే వీటిని మంజూరు చేయనున్నారు. నాటుకోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడానికి ప్రభుత్వం సాయం అందించనుంది. ఒక్కో జిల్లాకు 3 కోట్లతో రెండు వేల డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు నాటుకోళ్లను అందించనున్నారు. దీనికోసం ఒక్కొక్కరికీ 15వేల రూపాయల రుణం అందజేస్తారు. వీటి ద్వారా దాదాపు 100 వరకు నాటు కోళ్ల పిల్లలను తెచ్చి పెంచుకునే అవకాశం ఉంది. వీటితోపాటు కోళ్ల ఫారాలు పెట్టుకునేందుకూ ఆర్థికసాయం చేయనున్నారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఒక్కో యూనిట్‌కు రెండు లక్షల 91వేల రూపాయలు రుణం అందించ నున్నారు. సొంతంగా స్థలం ఉండి షెడ్డు వేసుకుని ఫారం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చే డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు వీటిని మంజూరు చేయనున్నారు. కోళ్ల ఫారం నిర్వహణపైనా వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సైతం ప్రభుత్వం రుణం మంజూరు చేయనుంది. పాల విక్రయ కేంద్రాలను సైతం మండలానికి ఒకటి చొప్పున మహిళా సంఘాలకు అందజేయనున్నారు. బస్టాండ్లు(ఃబీబ ఞబిజీనిట), రైల్వేస్టేషన్లు, సినిమా థియేటర్లు, రైతు బజార్లు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక్కో యూనిట్‌కు లక్షా 90వేల రూపాయల రుణం ఇవ్వనున్నారు. డ్వాక్రా సంఘాలకు ఉమ్మడి ఏపీలోనూ ప్రభుత్వాలు సాయం అందించాయి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేందుకు వారితో కుట్టుపరిశ్రమలు ఏర్పాటు చేయించారు.అలాగే డ్వాక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించారు. గేదెలు కొనుగోళ్లు రుణాలు, గొర్రెల పెంపకానికి సాయం వంటివి చేశారు. మళ్లీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కార్ మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు సాయం చేస్తున్నారు.

## మందలించినందుకు టీచర్‌ను పొడిచి చంపిన విద్యార్థి

గౌహతి,జూలై 8 : మార్కులు తక్కువ విద్యార్థిని ఉపాధ్యాయుడు మందలించడంతో అతడిని బాలుడు పొడిచి చంపిన సంఘటన అస్సాంలోని శివసాగర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. 11వ తరగతి విద్యార్థి రసాయన శాస్త్రంలో తక్కువ మార్కులు రావడంతో రాజేశ్ బారువా విజయవాడ(55) అనే ఉపాధ్యాయుడు బాలుడిని మందలించాడు. తలిదండ్రులను తీసుకరమ్మని ఇంటికి పంపాడు. విద్యార్థి కత్తితో పాఠశాలకు హాజరయ్యాడు. తరగతి గదిలో రాజేశ్ రాగానే అతడిపై విద్యార్థి కత్తితో దాడి చేశాడు. కత్తి తలలోకి దిగడంతో వెంటనే రాజేశ్‌ను తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఉపాధ్యాయుడు చనిపోయాడని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు విద్యార్థిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

## బోడకాకర కాయతో భలే ప్రయోజనాలు

### -ఎన్నో వ్యాధులకు చెక్... బోడ కాకరకాయ ఉపయోగాలు తెలుసుకుందాం



కాకరకాయ జాతికి చెందినదే ఆకాకరకాయ. దీనిని అడవి కాకరకాయ, లేదా బోడ కాకరకాయలు అంటారు. కాకరకాయల మాదిరిగా పొడుగ్గా కాకుండా రౌండ్ గా ఉండి..చిన్న చిన్న బొడిపలుంటాయి. అయితే దీని ఖరీదు కాస్త ఎక్కువనే చెప్పాలి. ఇవి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో ఎక్కువగా దొరకుతాయి. ఆ కాకరకాయను ఆహారంలో తీసుకోవం వలన మధుమేహం , గుండె జబ్బులతో పాటు అధిక బరువు సమస్యను కూడా తగ్గించుకోవచ్చు అని చెబుతుంటారు.బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే డయాబెటిక్ పేషంట్లకు సైతం బోడకాకర ఎంతో మంచిది. ముఖ్యంగా రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించడంలో బోడకాకర ఉపయోగపడుతుంది. బోడ కాకరకాయ సీజన్ వచ్చిందంటే చాలు చాలామంది దీని కూర చేసుకొని తినేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో 'ఆకాకరకాయ' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో సేకరించే ఈ కాయ వర్షాకాలంలో విరివిగా లభిస్తుంది. ఎంత ధరైనా సరే వెచ్చించి తినేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో బోడకాకర కాయ ధర కిలో.300 నుండి 400 రూపాయలపైన పలికినా కష్టమర్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బోడకాకరతో పులుసు, వేపుడు కూర, పొడి చేసుకునేందుకు భోజన ప్రియులు ఇష్టపడతారు. కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే లభించే బోడకాకరను గిరిజనులు అడవిలో సేకరించి మార్కెట్లో దళారులకు అమ్ముతుంటారు. ఇక బోడ కాకరలో పోషక విలువలతో పాటు ఔషధ విలువల కూడా మెండుగా ఉంటాయి. ముఖ్యంగా బోడకాకరతో పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక వోతాదులో ఉంటాయి. అలాగే దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే డయాబెటిక్ పేషంట్లకు సైతం బోడకాకర ఎంతో మంచిది. ముఖ్యంగా రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించడంలో బోడకాకర ఉపయోగపడుతుంది. ఇందులోని కెరోటినాయడ్స్ కంటి సంబంధిత వ్యాధుల నివారణకు ఉపకరిస్తుంది. అలాగే క్యాన్సర్ సహా ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడగకుండా కూడా ఈ కాయ రక్షిస్తుంది. ఇక చివరగా ఇందులోని ఫ్లవనాయిడ్లు వయస్సు మీరి వచ్చే ముడతలను నియంత్రిస్తాయి.

## ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా ఉగ్రవాదుల దాడి.. కొనసాగుతున్న కాల్పులు



న్యూఢిల్లీ:ఉగ్రవాదులు మరోసారి బరితెగించారు. ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా దాడికి పాల్పడ్డారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రం కతువా జిల్లాలోని మచేడి ఏరియాలో ఈ ఉగ్రవాద దాడి జరిగింది. కాన్వాయ్‌పై ఒక్కసారిగా ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో మచేడిలో కలకలం రేగింది. ఆర్మీ కాన్వాయ్ మచేడి ఏరియా నుంచి వెళ్తుండగా మాటువేసిన దుండగులు ఒక్కసారిగా ఆ కాన్వాయ్ లక్ష్యంగా కాల్పులకు దిగారు.దాంతో అప్రమత్తమైన జవాన్‌లు ఎదురు కాల్పులు మొదలుపెట్టారు. ప్రస్తుతం రెండు వైపుల నుంచి కాల్పులు కొనసాగుతున్నాయి. ఫైరింగ్ జరుగుతున్న ప్రాంతం ఇండియన్ ఆర్మీకి చెందిన 9 కార్ప్స్ పరిధిలోకి వస్తుందని ఆర్మీ అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

# మేడ్చల్ లో ఘోర రోడ్డు ప్రమాదం..

హైదరాబాద్: జులై 08 హైదరాబాద్ మేడ్చల్ జిల్లా లో ఈరోజు ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కీసర పోలీస్ స్టేషన్ పరిధి లోని ఔటర్ రింగ్ రోడ్డుపై కారు అదుపు తప్పడంతో శిక్షణలో ఉన్న విమాన పైల ట్ శ్రీకరన్ రెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారులో ఉన్న శ్రీకారన్ రెడ్డి యాదగిరిగుట్టకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది.యాక్సిడెంట్ పై సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డెడ్ బాడీని రికవరీ చేశారు.

మృతుడు శ్రీకరన్ రెడ్డి స్వస్థ లం గజ్వేల్ వాసిగా గుర్తిం చారు. నేరెడ్ మిట్ ప్రాంతం లో కుటుంబ సభ్యులు స్థిరపడ్డారు. బ్యాంకాక్ లో శిక్షణ పొందుతున్న పైలట్ శ్రీకరన్ రెడ్డి, గత వారం రోజుల క్రితం తన ఇంటికి వచ్చాడు.యాదగిరిగుట్ట కు వెళ్లి వస్తా అని ఇంట్లో చెప్పిఇవ్వాళ తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయలుదేరాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు...

## డిగ్రీలు చేతికొస్తున్నా నైపుణ్యాలు కరవు

### మెకాలే చదువులను దూరం పెట్టాలి

న్యూఢిల్లీ,జూలై8: దేశీయ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అసరముందని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత విద్యావిధానానికి అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యా ప్రపంచానికి వెలుగుదివ్వెగా ఉండేది. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ది చేసేలా శిక్షణ ఉండేది. కేవలం చదువలే గాకుండా అన్నిరంగాల్లో ఆరితేరేలా చేసేది. గురుకుల విద్యా విధానంలో అలాంటి అద్భుతాలు ఉండేవి. ఆనాడే అందరికీ ఒకే తరహా విద్యావిధానం అమల్లో ఉండేది. బ్రిటిషర్ల పాలన మొదలయ్యాక మన గురుకులాలను పాతరేశారు. మెకాలే తరహా విద్యావిధానం పట్టుకుని మనం ఇంకా పాకులాడడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరగడం లేదు. దీనికితోడు నీట్ పరీక్షల అవతకవలు విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేస్తోంది. ఒత్తి పరీక్షల్లో పడి విద్యార్థులు అసువులు బాస్తున్నారు.ఇదే విషయాన్ని ప్రధాని సహా మేధావులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే దీనిని మార్చే ప్రక్రియను చేపట్టడం ద్వారా భారతీయ విద్యను అంతర్జాతీ స్థాయిలో పోటీపడేలా చేయాలి. బ్రిటీష్ వాళ్లు తమ అవసరాలను తీర్చుకోవడానికి అనుగుణంగా బానిస వర్గాన్ని సృష్టించే విద్యా విధానాన్ని దేశంలో అమలు చేశారు. జాతీయ విద్యా విధానం అమలుకు సంబంధించి జరుగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేయాలి. కేవలం డిగ్రీ పట్టాలను అందిచడమే కాకుండా దేశాన్ని ముందుకు నడిపే మానవ వనరులను అదించేలా విద్యా వ్యవస్థ ఉండాల్సి అవసరం గుర్తించాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఇంకా చాలా మార్పులు చేయాల్సిన అవసరముంది. ఇప్పుడు పిల్లలంతా ఇతరులపై పోటీ పడేందుకు గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రతిదీ గూగుల్‌లో సర్చ్ చేయడం అలవాటు చేసుకున్నారు. శారీరక శ్రమతో పాటు మానసిక ధృఢత్వాన్ని ప్రస్తుత విద్యావిధానంలో అమలు కావడం లేదు. మన విద్యా ప్రాంగణాలలో అలాంటి పిల్లలకు అవసరమైన వాతావరణం కల్పించాల్సి ఉంది. ఎన్ఇపి ద్వారా భారతీయ భాషల్లో విద్యనభ్యసించేందుకు తలుపులు తెరుచుకోవాలి. ప్రపంచ విద్యాభ్యాస గమ్యస్థానంగా భారత్ ఎదిగేలా చేయాలి. ఎంతసేపూ మనం విదేశాలకు వెళ్లకుండా మనవద్దకే వచ్చేలా చేయగలగాలి. గతేడాది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), బెనారస్ హిందూ యూనివర్సిటీతో కలిసి కేంద్ర విద్యాశాఖ మూడు రోజుల పాటుఈ సదస్సును నిర్వహించింది. వలస పాలకుల సొంత అవసరాలు తీర్చుకోవడమేఆ విద్యా వ్యవస్థ లక్ష్యంగా మారింది. ఇప్పటికీ చాలా వరకు మార్పు లేకుండానే అది కొనసాగుతోంది. విద్యావ్యవస్థ అంటే కేవలం డిగ్రీ హోల్డర్లను ఉత్పత్తి చేయడమే కాదు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మానవ వనరులను అందించాలన్న లక్ష్యం కావాలి.డిగ్రీల కోసం కాకుండా, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌గా తమను తాము రూపొందించుకునేందుకు యువత సిద్ధం కావాల్సి ఉంది. విద్యా వ్యవస్థను సంకుచిత ఆలోచనల నుంచి బయటికి తీసుకురావాలి. అప్పుడే మన లక్ష్యం నెరవేరగలదు. అందుకు మానవవనరులను అభివృద్ధి చేసే విద్యావిధానం రావాల్సి ఉంది. చదువు ఏదయినా స్వశక్తితో నిలబడగలిగేలా పౌరులను తీర్చిదిద్దగలగాలి.

## గౌరవ డాక్టరేట్ అవార్డు కు ఎంపికైన వీరభద్రాచారి

### ఆయుర్వేద వైద్య సేవలకు గాను ఈ నెల 20న ఢిల్లీలో అవార్డు ప్రధానం

ఖమ్మం, జూలై 8, (న్యూస్ పల్స్)ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించి నందుకు గాను ఖమ్మం జిల్లాకు చెందిన రామడుగు వీరభద్రాచారి కి ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్, న్యూఢిల్లీ వారిచే గుర్తింపు పొంది, గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక అయ్యారు.ఖమ్మంలోని వీడిఓస్ కాలనీకి చెందిన రామడుగు వీరభద్రా చారి పారంపర్య ఆయుర్వేద వైద్యునిగా నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు దాదాపు 430 మందికి సురక్షిత కాన్పుల వైద్య సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈనెల 20న ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ వారిచే న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా, రఫీ మార్గ్ లో వీరభద్రాచారి కి అవార్డు ప్రధానం చేయనున్నారు.వీరభద్రా చారి 1984లో గ్రామ అధికారి పట్వారి గా, 2000 సంవత్సరంలో రెవెన్యూ గ్రామ పరిపాలన అధికారి గాను, గ్రామ అభివృద్ధి అధికారి గాను, 2017లో రిజర్వ్ పంచాయతీ అధికారి గాను వివిధ హోదాలలో ఆయన విధులు నిర్వహించారు. 2015లో ఆయన పదవి విరమణ పొందారు. అలోపతి వైద్యం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పేదలకు వంశ పారంపర్యం గా వైద్య సేవలను కొనసాగిస్తూ ఉండేవారు. ఆయన చేసిన సేవలకు గాను గతంలో సంగం అకాడమీ వారిచే నేషనల్ యూనివర్సిటీ అవార్డు, ది టార్గెట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచ్చే రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైడ్ అవార్డు 2024, విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వారిచే విశ్వకర్మ లెజెండరీ అవార్డు, హాస్యం ఆర్టిస్ట్ యూనియన్ వారిచే గౌరవ డాక్టరేట్ అవార్డు లను పొందారు. రామభద్ర ఆయుర్వేద మూలిక యోగ పీఠం ఖమ్మం వారిచే ప్రతి 27 రోజులకు ఒకసారి పుష్యమి నక్షత్రం రోజున 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఆయుర్వేద ఇమ్యూనికేషన్ స్వర్ణ బిందు ప్రాశన ఉచిత చుక్కల మందును అందిస్తూ వస్తున్నారు.గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల వీరభద్రాచారిని పలువురు అభినందిస్తున్నారు.

## రాజకీయాలకతీతంగా ప్రజాసేవ చేస్తా

### - సీపీఎం, (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయాల సందర్శనలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### - సాయిబాబా ఆలయంలో పూజలు, కరుణగిరి చర్చిలో ప్రార్థనలు

ఖమ్మం:రాజకీయ పార్టీలకతీతంగా ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని, అందరివాడిగా ఉండి తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఉదయం ఆయన నగరంలోని వీడీవోస్ కాలనీలో సాయిబాబా దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలోని ఫోర్త్ ఎంప్లాయిస్ చర్చిని సందర్శించి అక్కడ ప్రార్ధన చేశారు. ఆ తర్వాత సీపీఎం, సీపీఐ(మాస్ లైన్) ప్రజాపంథా జిల్లా కార్యాలయాలకు వెళ్లి ఎన్నికలప్పుడు తనకు మద్దతునిచ్చి భారీ విజయానికి సహకరించినందుకు ఆ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు ఎంపీ కి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..తన గెలుపును.. అందరి విజయంగా భావిస్తానని కృతజ్ఞతలు తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రజాస్వామ్య పరిరక్షణకు తనవంతుగా లోక్ సభలో గళం విప్పుతానని అన్నారు.

# వేములవాడలో పెరిగిన రద్దీ

### కోడెల పంపిణీని ప్రారంభించిన ఆది శ్రీనివాస్

వేములవాడ,జూలై8: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారంతో కావడంతో భక్తులు పోటెత్తారు. దీనికితోడు కోడెల పంపిణీ తిరిగి ప్రారంభమైంది. ఆరు నెలల క్రితం ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ప్రారంభించారు. 511 మంది రైతులకు రెండు కోడెల చొప్పున పంపిణీ చేశారు. కోడెలను ఇతరులకు అమ్మబోమని, తామే సాకి వ్యవసాయ పనులకు ఉపయోగించుకుంటామని రైతుల నుంచి అంగీకారపత్రం తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్దిదారుల ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను అధికారులు సేకరించారు. తద్వారా ఎప్పటికప్పుడు కోడెల పరిక్షరణను పర్యవేక్షించనున్నారు. ఎములాడ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కోడె మొక్కులు చెల్లించుకుంటారు. అలా వచ్చిన కోడెలు, ఆవులను ఆలయ అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తారు. వాటిని ఎప్పటికపుడు అన్నదాతలకు అందజేస్తుంటారు. అయితే గత ఆరు నెలల నుంచి పంపిణీ చేయకపోవడంతో గోశాలలో సామర్థ్యానికి మించి మూగజీవాలు వచ్చి చేరాయి. గోశాలలో మొత్తం 500 కోడెలు ఉండడానికి సౌకర్యాలుండగా, ప్రస్తుతం 1800 వరకు ఉన్నాయి. దీంతో జీవాలకు వ్యాధులు సంక్రమిస్తాయని భావించిన అధికారులు.. కోడెల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గోశాల నుంచి కోడెలను నిజమైన లబ్దిదారులకు అందించేందేకు కలెక్టర్ ఆధ్వర్యంలో విధివిధానాలు రూపొందించించారు. దానికి అనుగుణంగా కోడెలను పంపిణీ చేశారు. కాగా, ఎవరైనా కోడెల సంరక్షణ భారమని భావిస్తే తిరిగి గోశాలలో అప్పగించవచ్చని స్పష్టం చేశారు.

# పెరుగుతున్న డెంగ్యూ కేసులు




నిజామాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్) వర్షాకాలం వచ్చిందంటే దోమల బెడద పెరుగుతుంది, వాటితో రోగాలు పెరుగుతాయి. గత కొద్దిరోజులుగా తెలంగాణలో డెంగ్యూ కేసుల సంఖ్య పెరుగుతోంది. వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రాష్ట్రంలో గత నెల జూన్ లో మొత్తం 263 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇక 9 మలేరియా కేసులు రికార్డు అయినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డెంగ్యూ పాజిటివ్ కేసులు స్వల్పంగా తగ్గాయని పేర్కొంది. సీజనల్ వ్యాధులు విజృంభించేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్న నేపథ్యంలో?. అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది.గతేడాది జూన్ లో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 284 కేసులు నమోదు కాగా... ఈ ఏడాది జూన్ లో 263 కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. గతేడాదితో పోల్చితే 21 కేసులు తగ్గాయి. ఇక గతేడాది జూన్ లో మొత్తం 14 మలేరియా కేసులు నమోదవ్వగా.. గత నెల జూన్ లో కేవలం 9 కేసులు రికార్డయ్యాయి. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో? కేసుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.డెంగ్యూ కేసులు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో?. మానవ వనరులు, మందులు, ఔషధాల లభ్యతపై దృష్టి పెట్టాలని ఆరోగ్యశాఖ? జిల్లా అధికారులకు సూచించింది. రోజువారీ కేసు రిపోర్టింగ్ తో పాటు అవగాహన కార్యక్రమాలకు సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్లతో పాటు పంచాతయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఆదేశించారు.మరోవైపు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల నుంచి డెంగ్యూ కేసుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు 10 నుంచి 15 రోజులకు ఒకసారి ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఫాగింగ్ లాగ్‌బుక్స్‌ను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.డెంగ్యూ కూడా దోమల ద్వారా సంక్రమించే వ్యాధి. ప్రత్యేకంగా ఏడిస్ ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది, ఈ దోమలు రాత్రి కంటే కూడా పగటిపూట ఎక్కువ దాడి చేస్తాయి. కాబట్టి పగటివేళలో కుట్టే దోమలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.చెప్పలేని జ్వరం, నిరంతర తలనొప్పి, కళ్ళలో నొప్పి (కనురెప్పల చుట్టూ), ఒళ్లు నొప్పులు, మంటతో కూడిన కీళ్ల నొప్పులు, అనారోగ్యానికి గురైన కొద్ది రోజులలో దద్దుర్లు కనిపించడం వంటి లక్షణాలు ఉంటాయి. అదనంగా నిరంతర వాంతులు, చిగుళ్లలో రక్తస్రావం, సులభంగా గాయాలు, కడుపు నొప్పి వంటి ఇతర సూచికలను గమనించాలి. ఈ లక్షణాలలో ఏవైనా వ్యక్తమైతే, తక్షణ వైద్య సహాయం తీసుకోవడం అత్యవసరం అని డాక్టర్లు చెబుతున్నారు.దోమకాటుకు గురికాకుండా ఉండేందుకు శరీరాన్ని నిండుగా కప్పి ఉంచే దుస్తులు, ఫుల్ స్లీవ్‌లు ధరించాలని సూచిస్తున్నారు. అలాగే శరీరానికి దోమల వికర్షక క్రీములు కూడా రాసుకోవాలని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు నీరు నిల్వకాకుండా చూసుకోవాలని చెబుతున్నారు. దోమల నివారణ మందులు, దోమతెరలు వాడాలని సూచించారు.

## మాజీ సర్పంచ్ దారుణ హత్య

వరంగల్,జూలై8(ఆర్ఎన్ఎ): వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బురహాన్ పల్లి గ్రామమాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ రావు రాత్రి తన ఇంట్లో హత్యకు గురైనట్లు సమాచారం. మృతుడు దేవేందర్ రావు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. హత్యకు రాజకీయ కక్షలు, భూవివాదం కారణమని తెలిసింది. హంతకులు కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారేనని సమాచారం. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# టూ టైర్ సిటీస్ కు గ'మ్మత్తు...'

కరీంనగర్, జూలై 8, (న్యూస్ పల్స్) మత్తు గమ్మత్తుగా మారింది. గంజాయి గుప్పుమంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యువత గంజాయి మత్తులో జోగుతోంది. ఎక్కడ చూసిన గంజాయి విక్రయాలు యధేచ్చగా సాగుతున్నాయి. ఇక్కడ అక్కడ అనే తేడా లేదు.. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుతున్నాయి. పోలీసుల కళ్లు గప్పి స్మగ్లర్లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, యువకులు గంజాయి బారిన పడి మత్తులో ఊగుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిఘా పెంచారు.ఉమ్మడి జిల్లాలో గంజాయి అక్రమ వ్యాపారం దర్జాగా సాగుతోంది. దేశ భవిష్యత్ ను తీర్చిదిద్దాల్సిన యువత ఈ గంజాయి మత్తు బారిన పడి చిత్తవుతున్నది. రోజురోజుకు గంజాయి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోలీసు యంత్రాంగం నిత్యం దాడులు నిర్వహిస్తూ.. యువత, మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తూ తల్లిదండ్రులను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. పేద, మధ్య తరగతి యువతను ఆకర్షించి మత్తులో దింపి వారిచే మరికొందరిని ఆకర్షించడం ద్వారా గంజాయి విక్రయాలను గణనీయంగా పెంచుకుంటున్నారు. మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఇప్పుడు గంజాయి బారిన పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతుండటంతో ఇటు తల్లిదండ్రులు.. అటు పోలీసు వర్గాలు కలవరపడుతున్నాయి. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఒకవైపు పోలీసు యంత్రాంగం నిరంతరం తలమునకలవుతుంటే.. కొత్త కొత్త మార్గాల్లో సరికొత్త రూపాల్లో గంజాయిని జిల్లాలోకి తరలిస్తూ వ్యాపారులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.గంజాయి రవాణా విపరీతంగా పెరిగింది. కరీంనగర్ తో పాటు, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో యథేచ్చగా గంజాయి లభిస్తోందని తెలుస్తోంది. వివిధ మార్గాల్లో గంజాయిని రవాణా చేస్తున్నారు. జగిత్యాలలో ఎక్కడ పడితే అక్కడ గంజాయిని సరఫరా చేస్తున్నారు. పోలీసులు నిరంతరం దాడులు చేస్తూ పట్టుకున్నారు. ఇటీవల కాలంలో గంజాయిని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కరీంనగర్ లో కూడా వివిధ ప్రాం తాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. నగరం... నడిబొడ్డున ఈ దందా దర్జాగా కొనసాగుతోంది.. కట్టారాంపూర్ లోని ఓ మైదానంలో నిత్యం గంజాయిని సేవిస్తున్నారు. అదే విధంగా ఆదర్శనగర్, సుభాష్ నగర్, మారుతీనగర్, విద్యానగర్ ఖాళీ ప్రాంతాల్లో గంజాయిని పిల్చుతున్నారు. నగర శివారులో ప్రొఫెషనల్ విద్యార్థులు ఈ మత్తుకు అలవాటుపడుతున్నారని తెలుస్తోంది. చిగురు మామిడి మండలంలో సుందరగిరి గ్రామ శివారులో గంజాయి మత్తులో యువకులు ఓ వ్యక్తి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. మత్తులో బీరు సీసాతో దాడి చేసి కటకటాలపాలయ్యారు.సరదా కోసమే.. స్నేహితుల ఒత్తిడి కోసమే ఒక్క సారిగా గంజాయి సేవిస్తే మత్తుకు పూర్తిగా అలవాటు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో ఎల్ఎండి శివారులో గంజాయి తాగుతున్నారు. గతంలో గంజాయి మత్తులో వివిధ నేరాలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. కొంత మంది మైనర్లు కూడా ఈ గంజాయికి అలవాటు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగర శివారులో పోలీసులు పెట్రోలింగ్ ను పెంచారు... గతంలో గంజాయి సేవించి దొరికిన యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు పోలీసులు... వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.. అయితే.. ఏ చిన్న అనుమానం వచ్చినా, తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు పోలీసులు. అదే విధంగా పలు స్వచ్ఛంద సంస్థలు ఈ మత్తు నుంచి ముక్తి చేయడానికి అవగాహన కల్పిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న గంజాయి రవాణా, సమాజంపై తీవ్రప్రభావం చూపుతోంది. యువత చెడిపోతుంది... ఈ విషయంలో.. ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని పలు స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.రాష్ట్ర సరిహద్దు నుంచి యథేచ్ఛగా గంజాయి రవాణా అవుతుంది. కొంతమంది గంజాయి రవాణాను వ్యాపారంగా మార్చుకొని లక్షలు సంపాదిస్తున్నారు. చెక్ పోస్ట్ అధికారుల కళ్లు గప్పి రాష్ట్రంలో అడుగుపెట్టిన తర్వాత జిల్లాల వారీగా గంజాయిని వివిధ రూపాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా గంజాయి సాగు కాకున్నా, ఒడిశా, ఏపీ, చతీష్ గడ్ నుంచి రవాణా అవుతుందని తెలుస్తోంది. మత్తుకు అలవాటు పడిన వారి జాబితా ముందే సేకరించి ఉండటంతో ఒక్కో ప్రాంతంలో ఏ మేరకు గంజాయి అమ్మకాలకు డిమాండ్ ఉందో గుర్తించి ఆ మేరకు సరఫరా చేస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. చాక్లెట్ రూపంలో గంజాయి విక్రయిస్తు వేములవాడలో ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్టు అయ్యారు. ఇటీవల కరీంనగర్ శివారులో 70 కిలోల గంజాయిను పట్టుకున్నారు. అలాగే సిరిసిల్లలో 4 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు. జగిత్యాలలో మైనర్లు గంజాయికి అలవాటు పడితే.. కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మత్తు కారణంగా నేరాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, దాడులు చేస్తున్నారు. గంజాయి సేవించిన వారు నేరాలకు పాల్పడుతున్నారని.. పోలీసులు చెబుతున్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రోత్సాహకాలు అందిస్తాం

### స్వయం సమృద్ధికి తోడ్పాటు ఇస్తాం: కోమటిరెడ్డి

నల్లగొండ,జూలై8): ట్రాన్స్‌జెండర్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అన్నారు.. చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతులకు,ట్రాన్స్ జెండర్స్‌కి స్వయం ఉపాధి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. స్వచ్ఛంద సంస్థలు మహిళల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమనికి 2 లక్షల రూపాయల విరాళం అందజేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు.

## బ్యాంకులపై ఆర్బీఐ కొరడా..




ముంబై, జూలై 8, (న్యూస్ పల్స్)దేశ ఆర్థిక వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడడంలో భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) చాలా కీలకంగా వ్యవహరిస్తుంది. దేశంలో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించడం, ద్రవోల్బణం లేకుండా చూడడం, వివిధ బ్యాంకులకు సహాయ సహకారాలు అందజేయడం దీని ప్రధాన విధులు. తద్వారా దేశంలో ఆర్థిక స్థిరత్వం కలగడం, అభ్యున్నతి దిశగా పయనించడానికి అవకాశం కలుగుతుంది.రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దేశంలోని వివిధ బ్యాంకుల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. వాటికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుంది. ఒకవేళ ఆ బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.1.31 కోట్ల జరిమానా విధించింది. అలాగే షింషా సహకార బ్యాంకు లైసెన్స్ ను రద్దు చేసింది. ఆయా బ్యాంకులు నిబంధనలను సక్రమంగా పాటించకపోవడంతో ఈ చర్యలు తీసుకుంది.పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్బీ) రుణాలు, అడ్వాన్స్ లు, కేవైసీకి సంబంధించి కొన్ని నిర్దిష్ట ఆదేశాలను పాటించలేదు. ఆ బ్యాంక్ ను 2022 మార్చి 31న తనిఖీ చేసినప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఈ విషయాన్ని గమనించింది. వాటిపై సమాధానం చెప్పాలని బ్యాంకుకు నోటీసులు జారీ చేసింది. దానికి పీఎన్బీ నుంచి వచ్చిన ప్రత్యుత్తరాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత జరిమానా విధించింది.సబ్సిడీలు / వాపసులు / రీయింబర్స్‌మెంట్ల ద్వారా ప్రభుత్వం నుంచి స్వీకరించదగిన మొత్తాలకు వ్యతిరేకంగా రెండు రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్‌లకు వర్కింగ్ క్యాపిటల్ డిమాండ్ రుణాలను పీఎన్బీ మంజూరు చేసినట్లు ఆర్బీఐ గుర్తించింది. అలాగే కొన్ని ఖాతాలలో వ్యాపార సంబంధాల సమయంలో కస్టమర్ల గుర్తింపు, వారి చిరునామాలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడంలో విఫలమైంది. దీంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌పై రూ. 1.31 కోట్ల ద్రవ్య పెనాల్టీ విధించింది.కర్ణాటకలోని షింషా సహకార బ్యాంక్ పైనా ఆర్బీఐ చర్యలు తీసుకుంది. ఆ బ్యాంకు ఆర్థిక పరిస్థితి దిగజారుతున్న నేపథ్యంలో దాని లైసెన్స్‌ను రద్దు చేసింది. దీంతో జూలై 5వ తేదీ సాయంత్రం నుంచి బ్యాంకింగ్ వ్యాపారం నిలిచిపోయింది. బ్యాంకును మూసివేయడానికి, అలాగే బ్యాంకు కోసం లిక్విడేటర్‌ను నియమించడానికి ఆర్డర్ జారీ చేయాలని కర్ణాటక సహకార సంఘాల రిజిస్ట్రార్‌ను కూడా కోరింది. లిక్విడేషన్ ప్రకారం డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నుంచి రూ. 5 లక్షల వరకు ఖాతాదారులు డిపాజిట్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ స్వీకరించడానికి అర్హులు. షింపా బ్యాంకులో 99.96 శాతం డిపాజిటర్లు డీఐసీజీసీ నుంచి తమ డిపాజిట్ల పూర్తి మొత్తాన్ని స్వీకరించడానికి అర్హులు అని ఆర్‌బీఐ తెలిపింది.షింపా బ్యాంకుకు తగిన మూలధనం, సంపాదన అవకాశాలు లేవని ఆర్బీఐ తెలిపింది.

## లోకల్ బాడీ ఎన్నికలపై కమలం గురి...

హైదరాబాద్, జూలై 8. (న్యూస్ పల్స్)లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ స్థానాల గెలుపు జోష్ ను భారతీయ జనతా పార్టీ కంటిన్యూ చేయాలని చూస్తోంది. ఢిల్లీలో గద్దెనెక్కిన కాషాయ పార్టీకి గల్లీలో గెలుపు కోసం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని చూస్తోంది. అందుకు బీజేపీ కార్యవర్గ సమావేశం వేదికగా కార్యాచరణ సిద్ధం చేయబోతోంది.తెలంగాణ బీజేపీ లోకల్ బాడీ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ ను సమాయత్తం చేయడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకుని కాషాయ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించబోతుంది. ఈ నెల12న హైదరాబాద్ శివారులోని శంషాబాద్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు ముందుగా పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. కోర్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో బీజేపీ నేతలు ప్రకటించనున్నారు. ఈ సమావేశాలకు బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యే అవకాశాలున్నాయి.గ్రౌండ్ లెవల్‌లో పార్టీ బలంగా ఉంటేనే తెలంగాణలో అధికారం సాధించడం ఈజీ అవుతుందని గుర్తించిన కాషాయ పార్టీ అగ్రనేతలు.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. 8 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన తెలంగాణ బీజేపీ.. కేవలం ఢిల్లీలో గెలిచే పార్టీ అనే ముద్రను తొలగించుకుని గల్లీలో కూడా సత్తా చూడాలని కమలనాథులు భావిస్తున్నారు. రాబోయే ఆరు మాసాల వ్యవధిలోనే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతానికి పైగా ఓట్లు.. 8 అసెంబ్లీ స్థానాలను సాధించిన బీజేపీ.. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతానికి పైగా ఓట్లతో 8 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. లోక్ సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని తిరిగి లోకల్ బాడీలో సాధించడం బీజేపీ ముందున్న పెద్ద సవాల్. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో మాదిరిగా కొట్లాడతామని చెబుతున్నారు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో 8 స్థానాల్లో గెలిపించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు.



తెలంగాణ నుంచి ఇద్దరికి కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఇచ్చినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబుతూ మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఎలాంటి పోరాటాలు చేయాలనే దానిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో చర్చించనున్నారు. మొత్తానికి లోకల్ బాడీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కొత్త సారథి పేరును ప్రకటిస్తారా? మరికొన్నాళ్లు వాయిదా వేస్తారా? కిషన్ రెడ్డి సారథ్యంలోనే లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్తారా? అన్నది మాత్రం సస్పెన్స్ గానే మిగిలింది.

# సినిమా తీరు

## తాప్సీని బాలీవుడ్ ఎగతాళి చేసిందా?



తాప్సీ కొంత కాలంగా బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కంటే బాలీవుడ్ లో బెటర్ గానే కొనసాగుతుంది. అక్కడికి వెళ్లిన తర్వాత సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించి పరిమిత బడ్జెట్ లో సినిమాలు నిర్మిస్తుంది. అక్కడి సెలబ్రిటీలందరితో అంతే మింగిల్ అవుతుంది. అక్కడే స్థిరపడాలి అన్న ఉద్దేశంతో అమ్మడు బాలీవుడ్ లో ముందుకు సాగుతుంది. అందుకు తగ్గ ప్రణాళిక వేసుకుని వెళ్తుంది.దాదాపు గా నాలుగైదేళ్లగా అక్కడే బిజీగా ఉంది. గత ఏడాది ఒకే ఒక్క సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఈ ఏడాది మాత్రం నాలుగైదు సినిమాలో రావడం పక్కాగా కనిపిస్తుంది. ఇప్పటికే కొన్ని కమిట్ అయిన ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవి షూటింగ్ దశలో ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. లాక్ అయితే ఏడాది ముగింపుకల్లా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చేయడం ఖాయం. ఇలా తాప్సీ కెరీర్ ఉత్తరాదిన సంతోషంగా సాగిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.'నా మనస్తత్వాన్ని ఉద్దేశించి ఎంతో మంది ఎగతాళి చేసారు. ఒకరిని చూసి మరోకరు కించపరిచే ప్రయత్నం చేసారు. ఎన్నో విమర్శలు సైతం కావాలని చేసేవారు. కానీ అవేవి నా జీవితాన్ని ప్రభావితం చేయలేదు. అలా ఎందుకు జరిగిందంటే నేను ఎంచుకున్న సినిమాలే కారణం. తప్పోఒప్పో చాలా సినిమాలు చేసాను. వాటి ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. నన్ను పైకి తీసుకురావడంలో ఆ పాఠాలు గుణపాఠాలుగా మలుచుకున్నాను.కానీ ఇవేవి నన్ను విమర్శించిన వాళ్లు తర్వాతి కాలంలో గుర్తించారో? లేదా? నాకు తెలియదు. నేను మాత్రం అలాంటి వాళ్లను పట్టించుకోను. కథలు, పాత్రల విషయంలో నా సొంత నిర్ణయంపైనే ముందుకెళ్తాను. ఎవరో ఏదో అన్నారని పట్టించుకుంటే జీవితంలో ముందుకెళ్లలేం' అని తెలిపింది.

## స్పిరిట్.. ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నారే..?

డార్లింగ్ ప్రభాస్ తాజాగా కల్కి 2898ఏడీ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. పాన్ వరల్డ్ రేంజ్ లో ఈ చిత్రం రిలీజ్ అయ్యింది. రిలీజ్ అయిన అన్ని భాషలలో అద్భుతమైన కలెక్షన్స్ తో కల్కి దూసుకుపోతోంది. మరికొద్ది రోజుల్లో వెయ్యి కోట్ల కలెక్షన్స్ రికార్డ్ ని కల్కి2898ఏడీ అందుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. టికెట్ ధరల్ని తెలుగు రాష్ట్రాలలో తగ్గించడంతో మరల కలెక్షన్స్ పెరిగాయని టాక్ వినిపిస్తోంది.ఇదిలా ఉంటే




ప్రభాస్ నెక్స్ట్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ మూవీ చేయనున్న సంగతి తెలిసిందే. టి-సిరీస్, భద్రకాళీ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. 300+ కోట్ల బడ్జెట్ తో స్పిరిట్ మూవీ తెరకెక్కనుంది. ప్రస్తుతం ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందంట. ఈ ఏడాది ఆఖరులో సందీప్ రెడ్డి వంగా సినిమాని స్టార్ట్ చేసే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఇదిలా ఉంటే స్పిరిట్ చిత్రాన్ని పాన్ వరల్డ్ మూవీగానే తెరకెక్కించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది.అందుకోసమే మూవీలో ప్రభాస్ కి ప్రతినాయకుడిగా హాలీవుడ్ లో రాణిస్తున్న సౌత్ కొరియన్ యాక్టర్ ని ఎంపిక చేయబోతున్నట్లు తెలుస్తోంది. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్ ఎటర్నల్ మూవీస్ లో కీలక పాత్రలలో నటించిన లీ డాంగ్ సిక్ ని స్పిరిట్ మూవీ కోసం సంప్రదిస్తున్నారంట. మూవీ కాన్సెప్ట్ ఇంటర్నేషనల్ లెవల్ లో ఉండబోతోందంట. అందుకోసమే హాలీవుడ్ యాక్టర్ ని ట్రై చేస్తున్నట్లు తెలుస్తోంది.హాలీవుడ్ లో లీ డాంగ్ సిక్ ని నటుడిగా మంచి పేరుంది. ఒకవేళ ఆయన ఒప్పుకుంటే మూవీ రేంజ్ అమాంతం పెరిగిపోతుంది. ఇదిలా ఉంటే మూవీలో ప్రభాస్ రెండు భిన్నమైన లుక్స్ లో కనిపిస్తాడనే మాట వినిపిస్తోంది. ఒక లుక్ ఫుల్ మాస్ రఫ్ అండ్ రగ్గడ్ గా ఉంటుందంట. ఈ లుక్ ప్రేక్షకులని సర్ప్రైజ్ చేస్తుందంట. మరో లుక్ లో సూపర్ స్టైలిష్ అవతార్ లో కనిపిస్తాడంట. హాలీవుడ్ హీరో రేంజ్ లో ఈ క్యారెక్టర్ లుక్ ఉంటుందనే మాట వినిపిస్తోంది.సినిమాలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రభాస్ కనిపిస్తాడని గతంలో సందీప్ చెప్పాడు. అయితే ఇప్పుడు లుక్ వేరియేషన్ దేనికోసం అనేది తెలియాల్సి ఉంది. ఒక వేళ ద్యూయల్ రోల్ లో ప్రభాస్ కనిపిస్తాడా లేదంటే ఒకే వ్యక్తిని రెండు భిన్నమైన లుక్స్ లో రిప్రజెంట్ చేస్తారా అనేది క్లారిటీ రావాల్సి ఉంది.

## మీ తలలో తెల్లటి చుండ్రు(వైట్ ఫ్లేక్స్) ఉంటే వెంటనే వేపను ఇలా వాడండి! తగ్గుతుంది!



ఇవి చుండ్రుకు సంబంధించిన సంకేతాలు. తలలో చుండ్రు వంటి తెల్లటి రేకులు ఏర్పడుతాయి. ఇది మీ నెత్తిమీద రాలిపోయే డెడ్ స్కిన్ సెల్స్. ఇప్పటి పరిస్థితుల్లో చిన్న పిల్లల్లో కూడా ఇలాంటి సమస్యలు కనిపిస్తున్నాయి. మీకు చుండ్రు ఉన్నప్పుడు, మీ తల చర్మం పొలుసులుగా లేదా ఎర్రగా కనిపించవచ్చు మరియు దురద లేదా చీకాకుగా అనిపించవచ్చు. ఈ పరిస్థితిలో మీ తలపై గోకడం లేదా రుద్దడం వల్ల తెల్లగా రేకులు లేదా తెల్లటి పొలుసులుగా పైకి కనబడతాయి. చుండ్రు అనేది తలలో డెడ్ స్కిన్ సెల్స్ పొలుసులుగా ఏర్పడే పరిస్థితి. తలలో వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్‌ను చుండ్రు అంటారు. తలను సరిగా శుభ్రపరుచుకోనప్పుడు, తలకు సరిపడా నూనె రాయకుండా ఎక్కువ రోజులు అలా పొడి జుట్టుతో ఉన్నప్పుడు లేదా నూనెను నిరంతరం వాడుతున్నప్పుడు, తలపై అదనపు నూనె పేరుకుపోయి చుండ్రుకు కారణమవుతుంది. అదేవిధంగా నూనెను వాడకుండా అలాగే వదిలేస్తే దురద, చుండ్రు వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి జుట్టుకు సంబంధించినంత వరకూ నిర్వహణ సక్రమంగా ఉంటేనే చుండ్రు తొలగిపోతుంది. ఎప చుండ్రు - తెల్లటి రేకులు లేదా తెల్లటి పొలుసులు? తలలో మొద దురదగా మొదలై తెల్లని రేకులు లేదా పొలుసులను ఏర్పరుస్తుంది.ఈ తెల్లని పొట్టువంటి పదార్థం బట్టలపై పడవచ్చు. మొదట, చుండ్రు తలపై రేకులుగా ఏర్పడి, ఇది తలలో స్థిరమైన దురదకు కారణమవుతుంది. ఒకేసారి చుండ్రును నివారించలేము. కానీ సకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే దానిని ప్రేరేపించే కారకాలను నిరోధించవచ్చు. అదేవిధంగా, తెల్లటి రేకులు కనిపించినప్పుడు ట్రిగ్గర్‌ను నివారించడం చుండ్రును నియంత్రించడంలో సహాయపడుతుంది. మీ తలలో మొటిమలు ఉన్నాయా?మొటిమలు దురుదపెడుతున్నాయా? వాటికి కారణాలు, నివారణ ఇక్కడ తెలుసుకోండి! చుండ్రు ఎప్పుడు పెరుగుతుంది? వాతావరణంలో హుముడిటీ ఎక్కువైనప్పుడు చుండ్రు వృద్ధి చెందుతుంది. అధిక తేమ మరియు చెమట కారణంగా ఇది వేసవి మరియు వర్షాకాలంలో ఎక్కువగా కనిపిస్తుంది. అదే సమయంలో, అవి చలికాలంలో కూడా ఎక్కువగా పెరుగుతుంది మరియు తలలో దురద మరియు పొడిగా మారుతాయి. దీన్ని పూర్తిగా నయం చేయలేము కానీ నియంత్రించవచ్చు. చుండ్రు తీవ్రతను తగ్గించవచ్చు. ముఖ్యంగా మీరు ఈ తెల్లటి పొలుసులను చూసినప్పుడు మీరు కొన్ని సహజ నివారణలతో నియంత్రించవచ్చు. ఒత్తైన జుట్టు కావాలా? అయితే ఈ పువ్వును నూనె ఉడికించి రోజూ వాడండి... తలలో తెల్లటి పొలుసులను వదిలించుకోవ డానికి వేప సహాయపడుతుందా? తలలో ఎలాంటి సమస్య ఉన్నా వేప శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తూ తలపై అడ్డుపడే రంధ్రాలను క్లియర్ చేస్తుంది. ఇది చుండ్రు నివారణలో ముఖ్యమైన ప్రభావాన్ని చూపుతుంది. జుట్టు ఎక్కువగా రాలుతుందా? అయితే కరివేపాకును ఇలా వాడితే మీ జుట్టు ఒత్తుగా, కాంతివంతంగా పెరుగుతుంది ఏం చేయాలి వేప ఆకులు - ఒక పిడికెడు తీసుకోవాలి. వేప ఆకుల నుండి కాడలను తీసివేసి వాటిని మిక్సీలో వేసి కొద్దిగా నీటితో మెత్తగా చేసి రసాన్ని మాత్రమే తీయండి. వెంట్రుకలను విడదీసి, వేప రసంలో దూదిని ముంచి, తలకు బాగా అప్లై చేయాలి. దాని రసం తల లోపలికి బాగా పడుతుంది. 20 నిమిషాల తర్వాత, షాంపూ లేకుండా సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి. గోరువెచ్చని నీటిని కూడా ఉపయోగించవచ్చు. గమనిక వేపలోని చేదును నివారించడానికి షాంపూ చేయడం మానుకోండి.

అప్పుడే చుండ్రుకు కారణమయ్యే తెల్లటి రేకులు పూర్తిగా రాలిపోతాయి. అయితే, ఇది వారానికి ఒకసారి మాత్రమే చేయాలి. వారంలో ఒకటికి మించి చేయకూడదు. వెంట్రులక దెబ్బతింటాయి. జిడ్డుగల జుట్టు కోసం వేప వేప నూనెను వేపాకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చా అనే ప్రశ్న చాలా మందికి ఉంటుంది.

## కల్కి.. రేట్లు తగ్గిస్తే ఎంత లాభమో చూశారా..

పెద్ద సినిమాలకి టిక్కెట్ల రేట్లు పెరగడం అనేది చాలా కామన్. అయితే ఇటీవల కాలంలో కొన్ని సినిమాలకు అదే పెద్ద సమస్య గా మారింది. ఫ్యామిలీతో కలిసి సినిమా చూడాలి అంటే మధ్యతరగతి ఆడియెన్స్ ఖర్చులకు భయపడుతున్నారు. ఇక ఎంతో బాగుంటే గాని సినిమా థియేటర్ల వరకు రావడం లేదనేది వాస్తవం. కంటెంట్ సూపర్ హిట్ టాక్ అందుకుంటేనే రేట్లు పెరిగినా జనాలు పెద్దగా పట్టించుకోరు.ఇక ఇటీవల కల్కి 2898ఏఆ సినిమా అందుకు ఉదాహరణగా నిలిచింది. మొదటి 5 రోజుల వరకు ఏపీ తెలంగాణలో కల్కి 10 కోట్ల షేర్ తక్కువ కాకుండా రాబట్టింది. ఇక 6వ రోజు నుంచి మెల్లమెల్లగా నెంబర్లు తగ్గుతూ వచ్చాయి. అయితే మళ్ళీ హఠాత్తుగా 11వ రోజు 10 కోట్ల షేర్ ను అందుకోవడం విశేషం. సెకండ్ వీకెండ్ లో చాలా చోట్ల హౌస్ ఫుల్ బోర్డులు దర్శనమిచ్చాయి. అందుకు కారణం సినిమా టిక్కెట్ల రేట్లు చాలా వరకు తగ్గించడమే.సెకండ్ వీకెండ్ లో మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ కు బాగా గిట్టుబాటు అయ్యిందని చెప్పవచ్చు. ఇక నిర్మాత అదే రేంజ్ లో రేట్లు కొనసాగించి ఉంటే ఈ స్థాయిలో నెంబర్స్ పెరిగేవి కావేమో. అలాగే నార్త్ లో కూడా సెకండ్ వీకెండ్ కలెక్షన్స్ ఒక్కసారిగా పుంజుకున్నాయి. నార్త్ లో మొదటి రోజు 22 కోట్ల నెట్ కలెక్షన్స్ అందుకున్న కల్కి ఆ తరువాత హెచ్చు తగ్గులను చూసింది. కానీ 11వ రోజు మాత్రం మళ్ళీ 22 కోట్ల నెట్ కలెక్షన్స్ అందుకోవడం విశేషం.



## అందానికే మరో అందం....






## ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా షెడ్యూల్ ఇదే.. పాక్‌తో మ్యాచ్ ఎప్పుడంటే?



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. ఫైనల్ మ్యాచ్ మార్చి 9న జరగనుంది.ఈ తేదీల తర్వాత టీమిండియా మ్యాచ్‌ల ముసాయిదా షెడ్యూల్ కూడా బయటకు వచ్చింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 20 నుంచి భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ప్రచారాన్ని ప్రారంభించనుంది.గ్రూప్-ఏలో బరిలోకి దిగిన టీమిండియా తన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో, రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. అలాగే మూడో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ జట్టుతో తలపడనుంది. దీని ప్రకారం టీమిండియా ముసాయిదా షెడ్యూల్ ఎలా ఉందో ఓసారి చూద్దాం..

ఫిబ్రవరి 20, 2025: భారత్ ఎబ బంగ్లాదేశ్

ఫిబ్రవరి 23, 2025: భారత్ ఎబ న్యూజిలాండ్

మార్చి 1, 2025: భారత్ ఎబ పాకిస్థాన్.

ఒకే స్టేడియంలో టీమిండియా మ్యాచ్‌లు?

ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లో జరగనుంది. అలాగే, ఈ టోర్నీ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మూడు స్టేడియాలను ఖరారు చేసింది. దీని ప్రకారం కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లు జరుగుతాయి.

లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో టీమిండియా మ్యాచ్‌లు జరగనున్నాయి. దీని ప్రకారం, భారత జట్టు తొలి రౌండ్‌లో లాహోర్‌లో తన అన్ని మ్యాచ్‌లను ఆడుతుందని సమాచారం.

లాహోర్‌లోనే ఎందుకు?

లాహోర్ నగరం భారత సరిహద్దుకు దగ్గరగా ఉంటుంది. ఇది భారత అభిమానుల ప్రయాణాన్ని కూడా సులభతరం చేస్తుంది. అందుకే టీమ్ ఇండియా అభిమానుల సౌకర్యార్థం భారత్ మ్యాచ్‌లను ఒకే స్టేడియంలో నిర్వహించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది.

భారత్ పాకిస్థాన్‌కు వెళ్లనుందా?

పాకిస్థాన్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న నేపథ్యంలో భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లిందా అనే ప్రశ్న తలెత్తింది. ఎందుకంటే 2006 తర్వాత భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లలేదు. అయితే, ఈసారి పాకిస్థాన్‌లో ఐసీసీ టోర్నీ జరుగుతున్నందున భారత్ జట్టుపై వెళ్లక తప్పేట్టు లేదు.ఈ టోర్నీకి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా.. బీసీసీఐ మాత్రం మౌనం వహిస్తోంది. పీసీబీ ఇప్పటికే తేదీలు, స్టేడియాలను నిర్ణయించినప్పటికీ, భారత క్రికెట్ బోర్డు తన వైఖరిని స్పష్టం చేయలేదు.పాక్ వెళ్లేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇస్తేనే టీమిండియా పాకిస్థాన్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ ఆడనుంది. లేదంటే తటస్థ వేదికలో టోర్నీని నిర్వహించాల్సిందిగా ఐసీసీని అభ్యర్థించవచ్చు. ఎఅఅ ఈ అభ్యర్థనకు అంగీకరించకపోతే, జంఇ లేదా శ్రీలంకలో తన మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వమని టీమ్ ఇండియా కోరవచ్చు. దీంతో భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఆడే అవకాశం ఉంది.

## శ్రీలంక క్రికెట్‌లో 'సూర్యోదయం'.. కోచ్‌గా ముద్ర వేస్తాడా..?

పొట్టి వరల్డ్ కప్‌లో లీగ్ దశలోనే నిష్క్రమించిన శ్రీలంక జట్టు రాత మారబోతోంది. నిరుడు ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్ నుంచి వైఫల్యాల బాటలో నడుస్తున్న లంకను గాడీలో పెట్టేందుకు కొత్త కోచ్ వస్తున్నాడు. అతడు ఎవరో కాదు ఆ దేశ వెటరన్ ఆటగాడు సనత్ జయసూర్య అవును.. శ్రీలంక ప్రధాన కోచ్‌గా జయసూర్య నియామకం ఖాయమైందని సమాచారం. ఈ విషయాన్ని సోమవారం అతడే స్వయంగా వెల్లడించాడు.'హెడ్‌కోచ్‌గా ఉండాలని లంక బోర్డు నన్ను కోరింది. ఆ జాబ్ చేపట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని జయసూర్య తెలిపాడు. శ్రీలంక బోర్డు కూడా లెజెండరీ క్రికెటర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ధ్రువీకరించింది.

'జయసూర్యను తాత్కాలికి హెడ్‌కోచ్‌గా నియమిస్తున్నామని ప్రకటిస్తున్నందుకు సంతోషంగా ఉంది.ఈ ఏడాది సెప్టెంబర్‌లో లంక జట్టు ఇంగ్లండ్ పర్యటన వరకు అతడు కోచ్‌గా ఉంటాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం గల జయసూర్య శ్రీలంకకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకూ పదవిలో కొనసాగుతాడు. అతడు జాతీయ జట్టును చక్కగా నడిపిస్తాడని నమ్ముతున్నాం' అని బోర్డు వివరించింది. గతంలో జయసూర్య నేషనల్ సెలెక్టర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నాడు.టీ20 వరల్డ్ కప్‌లో లంక లీగ్ దశలోనే ఇంటికి వెళ్లింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.